సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్
- మేడికొండూరులో గడప గడపకు మన ప్రభుత్వం


మేడికొండూరులో కరపత్రాలు అందజేస్తున్న సురేష్ కుమార్

మేడికొండూరు: సమస్య పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. మేడికొండూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. గ్రామ సచివాలయ స్థాయి నుంచి సెక్రటేరియట్ స్థాయి వరకు అవినీతి రహితపాలన కొనసాగిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతోందని పేర్కొన్నారు. గతంలో ప్రజలకు ఏ పని కావాలన్నా ప్రభుత్వ ఆఫీసులు చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని చెప్పారు. నేడు ఆ దుస్థితి లేదని వివరించారు. గ్రామ సచివాలయాలు రాకతో పని సులభతరంగా మారిందని అన్నారు. పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ఓర్వలేక టీడీపీ రైతులు ముసుగులో కోర్టుకు ఎక్కుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, కోఆప్షన్ మెంబర్ చంటి బాజి, ఆవుల సంజీవరెడ్డి, కొలకలూరి నాగేశ్వరరావు, బీవీ సుబ్బారెడ్డి, రాజేంద్రప్రసాద్, పాములపాటి జయరావు, మహ్మద్ ఆరీఫ్, ఉడతా ప్రభాకర్, బొడ్డు చిన సాంబయ్య, తలతోటి జవహర్; మిరియాల శివరామకృష్ణ, జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

వైఎస్సార్ సీపీ మండల కార్యాలయాన్ని నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెచ్చుడు వైఎస్సార్ సీపీ అని పేర్కొన్నారు. అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, కోఆప్షన్ సభ్యుడు చంటి బాజి, ఆవుల సంజీవరెడ్డి, కొలకలూరి నాగేశ్వరరావు, బీవీ సుబ్బారెడ్డి, రాజేంద్రప్రసాద్, పాములపాటి జయరావు, మహ్మద్ ఆరీఫ్, ఉడతా ప్రభాకర్, బొడ్డు చిన సాంబయ్య, తలతోటి జవహర్; మిరియాల శివరామకృష్ణ, జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మండే ఎండలు

- నిర్మానుష్యంగా రోడ్లు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు


రద్దీగా ఉండే మంగళగిరి- ప్రకాశం బ్యారేజ్ రోడ్డుపై కనిపించని వాహనాలు

తాడేపల్లిరూరల్: వేసవిలో ఎండలు తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. వడగాడ్పులు పగలు, రాత్రి తేడా లేకుండా వీచడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సోమవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రతతో పాటు వడగాడ్పులుతోడు కావడంతో 9 గంటల నుంచే ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. ప్రకాశం బ్యారేజ్ మంగళగిరి ప్రధాన రహదారితో పాటు తెనాలి రోడ్, జాతీయ రహదారి, పలు ప్రాంతాల్లో ప్రజలు ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వ్యాపారాలు సాగడం లేదు....

వేసవి కాలంలో కూల్‌డ్రింక్స్, జ్యూస్‌లకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. అయితే ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తప్పని సరైతే గానీ బయటకు రావడం లేదు. దీంతో ఆ సమయంలో దాహార్తిని తీర్చే కూల్‌డ్రింక్స్, జ్యూస్‌ల విక్రయాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయని విక్రేతలు వాపోతున్నారు.

వడగాడ్పులతో జాగ్రత్త

వడగాల్పులు తగిలే అవకాశాలు కూడా అధికంగానే ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు బయట తిరగవద్దంటున్నారు. చమటలతో శరీరం డీ హైడ్రేషన్‌కి గురికాకుండా తరచూ నీరు, గ్లూకోజ్ వాటర్, బార్లీ నీరు తాగుతుండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. అలాగే నీరసమనిపిస్తే ఓఆర్ఎస్ తీసుకోవడం మంచిదని అన్నారు.

క్లుప్తంగా

ఈమనిలో ఉపాధ్యాయుల ర్యాలీ



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమనిలో ప్రభుత్వ పాఠశాలలో నూరుశాతం అడ్మిషన్ల నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఏడు కొండలు మాట్లాడుతూ 2023లో పదో తరగతిలో మా పాఠశాల విద్యార్థులు 93 శాతం ఫలితాలు సాధించినట్లు చెప్పారు. పాఠశాలలో మౌలిక వసతులు, దాతల సహకారంతో ప్రోత్సాహకాలు, నాణ్యమైన విద్య, పోటీ పరీక్షకు సంసిద్ధులను చేయుట, స్పోర్ట్స్, భారత్ గౌడ్స్ అండ్ గైడ్స్, జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనుటకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌డీవీఎల్ ఫణి, ఎస్. బ్రహ్మేశ్వరరావు, ఎస్.ప్రకాష్‌రావు, టి.శ్రీనివాసరావు, జి.శ్రీనివాస్‌రెడ్డి, డి.నాగవేణి, పి.శిరీష, డి.సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



ఫిరంగిపురం: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేస్తున్నట్లు ఈసీ ప్రభాకర్ తెలిపారు. మండలంలోని మునగపాడులో నిర్వహిస్తున్న పనులను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మొత్తం 5,112 మంది కూలీలు ఉన్నారని, వారిచే వేసవి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా పంటకాలువల్లో పూడికతీత, మేజర్ కెనాల్, మైనర్ కెనాల్స్‌లో పూడికతీత పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీలు వేసవికి తగిన జాగ్రత్తలు పాటించేలా సిబ్బందికి తగిన సూచనలు చేశామన్నారు. ఆయన వెంట ఫీల్డు అసిస్టెంట్ రాణి ఉన్నారు.

సాంఘిక నాటక కళాకారుడు రమణారావుకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం రాముడు-భీముడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం దాగుడుమూతలు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు, రేడియో, టీవీ ఆర్టిస్ట్ గుత్తా వెంకట రమణారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫణిదపు దుర్గా, నరసింహారావు, అనిశెట్టి సత్యనారాయణ, చింతలపూడి శ్రీనివాసరావు, సోమవరపు సాంబశివరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

బాణసంచా పేలి ఆటో దగ్ధం

నెహ్రూనగర్: డొంక రోడ్డులో ప్రమాదవశాత్తు సోమవారం రాత్రి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. హనుమంత్ జయంతి సందర్భంగా ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ సమయంలో బాణాసంచా ఉన్న ఆటోకు ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమైంది. దీని ప్రభావానికి పక్కనే ఉన్న మరో ఆటో, ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దగ్ధమయ్యాయి. నడిరోడ్డుపై పెద్దఎత్తున మంటలు ఎగిసి పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నానికి సన్మానం

పట్నంబజారు: ఎమ్మెల్సీగా ఎన్నికైన చంద్రగిరి ఏసురత్నాన్ని వడియరాజుల ఆత్మీయ సభలో సోమవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళా వేదికగా వడ్డెర సంఘం నేత సల్లంగుల కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డెర సంఘ పెద్దలు హాజరై ఏసురత్నాన్ని దుశ్శాలువా, పూల మాలలతో, కిరీటంతో ఘనంగా సత్కరించారు.

నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

చేబ్రోలు: స్థానిక గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వైశాఖ బహుళ ఏకాదశి సందర్భంగా స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ బలం

- ఎన్నడూ లేని విధంగా మంగళగిరి అభివృద్ధి
- మంగళగిరి కోటపై మళ్లీ వైఎస్సార్ సీపీ జెండానే
- పార్టీ పరిశీలకుడు నిమ్మకాయల రాజనారాయణ


మాట్లాడుతున్న రాజనారాయణ వేదికపై ఎమ్మెల్సీ మురుగుడు, వేమారెడ్డి, చిరంజీవి, కాండ్రు కమల

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాటే వేదవాక్కు. సంక్షేమ పథకాలే మా బలం అని మంగళగిరి నియోజకవర్గ పరిశీలకుడు నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. పార్టీ నగర అధ్యక్షుడిగా దొంతిరెడ్డి వేమారెడ్డి ఎన్నిక సందర్భంగా సోమవారం రాత్రి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాజనారాయణతో పాటు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఏ హామీలు అయితే ఇచ్చారో వాటిని 95 శాతం అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని చెప్పారు. తిరిగి మరల ప్రజల అభివృద్ధి కోసం ఆయన్ని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేస్తున్నామని, మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీని ఓడించి, తిరిగి మంగళగిరి కోటపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేసేందుకు కష్టపడతామని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి జరిగిందని అన్నారు. ప్రతిపక్షాలు అన్నీ కలసి వచ్చినా మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని, మొదటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబానికి అండదండలుగా నియోజకవర్గ ప్రజలు ఉన్నారని చెప్పారు. అనంతరం దొంతిరెడ్డి వేమారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, తాడేపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఎండి గోరె, మాచర్ల అబ్బు, దర్శి విజయశ్రీ, కాటాబత్తుల నిర్మల, చిట్టిమల్ల స్నేహసంధ్య, గోలి రూపలక్ష్మి, వెంకటేశ్వరరావు, శింకా గంగాధర్, మేకా పావని, వైఎస్సార్ సీపీ నాయకులు కల్యాణ్, మేకా అంజిరెడ్డి పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధికి చెందిన ఖిద్మత్ టీమ్ సభ్యులు ఓ అనాథ వృద్ధుడి శవానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎంటీఎంసీ పరిధిలోని నులకపేటకు చెందిన కంచు నారాయణరావు(83) మృతి చెందాడు. బంధువులు ఎవరూ లేరు. దీంతో ఖిద్మత్ టీమ్ అంత్యక్రియలు నిర్వహించారు.

17 తేదీలోగా పంట నమోదు చేసుకోవాలి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని 18 గ్రామాల్లో మొక్కజొన్న పంట వేసిన రైతులు ఈనెల 17వ తేదీలోపు రైతుభరోసా కేంద్రాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న పండించిన రైతులు తమ ఆధార్‌కార్డు, ఆధార్ కార్డుకు లింక్ చేసిన మొబైల్ తీసుకుని వెళ్లి తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాని కోరారు.

పైపులైన్‌కు మరమ్మతులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట పంప్‌హౌస్ నుంచి ప్రకాష్‌నగర్ వాటర్ ట్యాంక్‌కు తాగునీటిని సరఫరా చేసే పైపులైను పగిలిపోవడంతో సోమవారం ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రకాష్ నగర్ వద్ద ట్యాంక్‌తో పాటు వేరే ప్రాంతానికి తరలించే జాయింట్ వద్ద లీక్ కావడంతో తాగునీరు వృథాగా డ్రైనేజీ పాలు కావడంతో స్థానికులు సచివాలయంలో ఫిర్యాదు చేయడంతో సిబ్బంది మరమ్మతులు నిర్వహించి సాయంత్రానికి నీటి సరఫరా పునరుద్ధరించారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు మాట్లాడుతూ వైఎస్సా ర్‌సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి సహాయ సహకారాలతో స్థానిక నాయకులు మణిపాల్‌సెంటర్, క్రిస్టియన్ పేట, నులకపేట, ప్రకాష్‌నగర్, డోలాస్‌నగర్ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు.

ఎండాకాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చల్లటి మంచినీళ్లు అందించడం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో ఆనందించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా, అధ్యక్షులు మేకా వెంకటరామిరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, తాడేపల్లి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా, మైనార్టీ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బి.అనిల్, బత్తుల దాసు, సంపూర్ణపార్వతి, టి.మహేష్‌రెడ్డి, సయ్యద్ రసూల్, అశోక్, మాజీ ఎంపీటీసీ జీలగ పెదగాలయ్య, షఫీ, నాయుడు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ


ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, దివీస్ లాబొరేటరీస్ ప్రతినిధులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఆత్మకూరులో ఉన్న నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు సోమవారం నిర్వహించిన ముఖాముఖి ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. దివీస్ లాబొరేటరీస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఫార్మసీ, డిగ్రీ, ఐటీఐ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల నుండి 108 మంది విద్యార్థులు హాజరు కాగా, వివిధ పరీక్షల అనంతరం 64 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. 64 మందిలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు 40 మంది ఉండడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు. ఎంపికైన వారికి జీతభత్యాలు మూడు లక్షల ఇరవై వేలు వార్షిక వేతనంగా అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో దివీస్ కంపెనీకి చెందిన మానవ వనరుల విభాగ అధికారులు హరికృష్ణ, పూర్ణ, డాక్టర్ బి.పాముల రెడ్డి, కళాశాల ఉపాధి కల్పన అధికారి కామేశ్వర రావు, సాంకేతిక సిబ్బంది విజయ్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

పసుపు మద్దతు ధర ప్రకటించాలని వినతి


తహసీల్దార్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ తహసీల్దార్ ఎం.నాగిరెడ్డికి సీపీఎం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పసుపు పంటను 10 వేల రూపాయలకు కొనుగోలు చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. గతంలో 6850 మద్దతు ధర ఉండేదని, పసుపు పంట కాల పరిమితి 11 నెలలు అని పురుగులు మందుల రేట్లు, వ్యవసాయ కూలీల ఖర్చులు ఎక్కువయ్యాయని మద్దతు ధర కనీసం 10 వేల రూపాయలు లేకపోతే పసుపు పండించిన రైతుకు గిట్టుబాటు ఉండదని వినతిపత్రంలో పేర్కొన్నారు. తహసీల్దార్‌కు విన్నవించిన వారిలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు, మండల కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పట్నంబజారు: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనక్కాయల ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్థానికులు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా సుమారు 40 సంవత్సరాల వయసున్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. వివరాలు తెలియలేదు. ఈస్ట్ ఏఎస్పీ నిచికేష్ సలేక్, కొత్తపేట సీఐ శీలం శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వడగాల్పులు లేదా మద్యం అధికంగా తాగడం వల్ల మృతి చెందాడా.. ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా ? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఒంటిపై గాయాలు ఉండటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటల వ్యర్థాల్ని తగలబెట్టరాదు


రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీఏ రామాంజనేయులు

కొల్లిపర: జొన్న, మొక్కజొన్న పంటలు కోతలు అయిన తరువాత వాటిని తగలబెట్టకుండా మల్చర్ యంత్ర పరికరంతో చిన్న చిన్న ముక్కలుగా చేసి, బయో డీకంపోసర్స్ ద్వారా కుళ్లింప చేసి సేంద్రియ పదార్థాలుగా మార్చవచ్చని డీడీఏ పి. రామాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని దావులూరులో సోమవారం గుంటూరు జిల్లా వనరుల కేంద్రం, అఖిల భారత వ్యవసాయ పరికరాల సమన్వయ కేంద్రం బాపట్ల ఆధ్వర్యంలో రైతులకు మల్చర్, బయో డీకంపోసర్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీడీఏ మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న పంటలు కోతలు అనంతరం రైతులు వాటి ఆకులు, కాండాల్ని తగలబెట్టడం వల్ల భూమిలోని అనేక ఉపయోగకర జీవరాశులు చనిపోతాయన్నారు. సేంద్రియ పదార్థాలు తగ్గిపోయి తద్వారా భూమి సహజ గుణం కోల్పోయి నిస్సారంగా తయారవ్వడమే కాకుండా పర్యావరణం కూడా దెబ్బతింటుందని తెలిపారు. పంటల అవశేషాల్ని తగలబెట్టకుండా మల్చర్ పద్ధతి ద్వారా భూముల్ని దున్నాలని సూచించారు. భూమిలో సారాన్ని పెంచాలంటే పచ్చిరొట్ట పంటలైన జీలుగ, పిల్లి పెసర వంటివి సాగు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రవీణ, ఏవో కె.వెంకటరావు, డీఆర్సీ రాజవంశీ, రైతులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన అవసరం

తాడేపల్లిరూరల్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కోర్ కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి జగన్‌మోహన్‌రావు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సెంటర్ వంశీ టాలెంట్ స్కూల్ ఆవరణలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్ కమిటీ సభ్యులు ప్రజలకు సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రయోజనాలను ఏ విధంగా కాపాడుతుంది, ప్రజాస్వామ్యంలో ప్రజల యజమానితత్వాన్ని ఏ విధంగా బలపరుస్తుంది అనే విషయాలను వివరించారు. తమ గ్రామాల్లో ఎవరైనా అవగాహనా సదస్సులను ఏర్పాటు చేయాలనుకుంటే 9948074365 లో సంప్రదించవచ్చని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి శీలం నాగార్జున, వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కొతవరపు ప్రసాద్, కోర్ కమిటీ సభ్యులు కోటా ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శిర్ల లాల్ చంద్, తాడేపల్లి మండల అధ్యక్షులు శెట్టి రామకృష్ణ, పెదకాకాని మండల అధ్యక్షులు పి.జోసఫ్, ప్రేమ్‌సాగర్, దివ్యల ఏడుకొండలు, ప్రశాంతి, కొనకళ్ళ రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'లయన్స్' సమ్మర్ క్యాంప్

చేబ్రోలు: పొన్నూరులోని లయన్స్ పాలీసర్వీస్ అండ్ వెల్ఫేర్ సెంటర్‌లో మే 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 10 రోజులపాటు సమ్మర్ క్యాంప్ జరుగుతుందని ప్రముఖ అబ్జర్వేషనల్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ సోమవారం తెలిపారు. స్టూడెంట్స్ ఇంటలెక్చువల్ ఫోరం వారి ఆధ్వర్యంలో లయన్స్ పాలి సర్వీస్ – వెల్ఫేర్ సెంటర్ వారి సహకారంతో 'ఈ తరంలో మేము ప్రత్యేకం' టైటిల్‌తో విద్యార్థులకు డ్యాన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫోక్, వెస్టర్న్, భాంగ్రా డాన్సులలో శిక్షణ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా నేటి విద్యార్థులకు జంక్ ఫుడ్ తినడాన్ని మాన్పించడం (హెల్త్ ట్రైనింగ్), సెల్ ఫోన్ వీడియో గేమ్‌లకు బానిసలుగా మారిన విద్యార్థులకు ప్రత్యేకమైన కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా వారిలో మార్పు తీసుకురావడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని శ్రీమన్నారాయణ తెలిపారు.

సివిల్ సర్వీస్ పరీక్షలో రాజ్యాంగం ముఖ్యమైన అంశం


శిక్షణ ఇస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్ సర్వీసెస్, గ్రూప్-1, గ్రూప్-2 వంటి పోటీ పరీక్షల్లో భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలు సిలబస్‌లో భాగంగా ఉంటాయని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు చెప్పారు. స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్, కె.వి.ఆర్.ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఏఎస్ ఫౌండేషన్ క్లాసుల్లో భారత రాజ్యాంగం గురించి సోమవారం వివరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వంలో రాజ్యాంగం రూపొందడం, ప్రాథమిక అంశాల గురించి ఎమ్మెల్సీ వివరించారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక విధులు ఉంటాయని తెలిపారు. న్యాయవ్యవస్థ, పౌరుల ప్రాథమిక హక్కులు కాపాడుతుందని చెప్పారు. భారత రాజ్యాంగం ప్రపంచంలో ఉన్నతంగా కొనసాగుతోందని తెలిపారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల్లో కూడా రాజ్యాంగంపై ప్రశ్నలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సాయి, బాలు, అజయ్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఈకేవైసీ తిప్పలు


ఈకేవైసీ కోసం తోసుకుంటున్న పారిశుధ్య కార్మికులు

నెహ్రూనగర్: అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులు ఈకేవైసీ చేయించుకోవడానికి తిప్పలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. నగరపాలక సంస్థలో సుమారు 3 వేల మందికి పైగా పనిచేస్తున్నారు. వీరందరికి అప్కాస్(అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్) ద్వారా జీతాలు అకౌంట్స్‌లో జమ అవుతుంటాయి. అయితే ఆధార్‌కి, ఫోన్ నంబర్ లింక్(ఈకేవైసీ) చేయించుకోవడానికి ప్రతి రోజు కార్మికులు నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం కార్మికులు తోసుకుంటు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

చిన్నారులను క్రీడల వైపు ప్రోత్సహించాలి


చిన్నారులను పరిచయం చేసుకుంటున్న పీటీఓ ఎస్పీ శివారెడ్డి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారులను క్రీడల వైపు ప్రోత్సహించే బాధ్యత తల్లిదండ్రులదేనని పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ విభాగ ఎస్పీ టి.శివారెడ్డి తెలిపారు. ఐటా చాంపియన్‌షిప్ సిరీస్‌లో భాగంగా ది సిటీ టెన్నిస్ చాంపియన్‌షిప్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన అండర్-16 బాలబాలికల టెన్నిస్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలను వృత్తిగా ఎంచుకుని దేశానికి పేరు తీసుకురావాలని కోరారు. కార్యదర్శి జి.జగదీష్ చంద్రబాబు మాట్లాడుతూ పోటీల్ని 19వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

'వైకేతో నేను' పుస్తకావిష్కరణ

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై సోమవారం సాయంత్రం కళావిపంచి – వైకే నాటక కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో 'వైకేతో నేను' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, సభాధ్యక్షులుగా గజల్ శ్రీనివాస్ వ్యవహరించారు. అతిథులుగా కళా విపంచి గౌరవాధ్యక్షుడు రామరాజు శ్రీనివాస్, కళ పత్రిక అధినేత డాక్టర్ ఎండీ. రఫీ, కథక్ కళాక్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ అంజిబాబు, దోగిపర్తి శంకరరావు, కంచర్ల ఆంజనేయులు, నటుడు నాయుడు గోపి, కళా పోషకులు నూతలపాటి తిరుపతయ్య, బి.వేదయ్య పాల్గొన్నారు. నాటక కళా పరిషత్ ద్వారా వైకే నాగేశ్వరరావు కళా రంగానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం గాదె రత్నారెడ్డి నిర్వహణలో శ్రీ కృష్ణ రాయబారం నుంచి పడక సీను ప్రదర్శించారు. శ్రీకృష్ణుడిగా మువ్వా పెద్దబాపిరెడ్డి, అర్జునిగా బ్రహ్మయ్య, దుర్యోధునిగా రామకృష్ణారెడ్డి అలరించారు. అనంతరం కళాకారులను, అతిథుల్ని సత్కరించారు. కార్యక్రమంలో కళా విపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, డి.తిరుమలేశ్వరరావు, జి.వి.జీశంకర్, జి.మల్లికార్జునరావు, సయ్యద్ జానీ బాషా పాల్గొన్నారు.